సూర్య www.suryaa.com
18వ వసంతంలోకి.. www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య www.suryaa.com

4PM www.suryaa.com
బుధవారం
16 అక్టోబర్ 2024
పేజీలు: 02

# కొత్త కెప్టెన్‌గా జెమీమా?

## కెప్టెన్సీ నుంచి హర్మన్‌ప్రీత్ ఔట్?



'ప్రపంచకప్‌కు సన్నాహంగా ఆడిన ఆసియా కప్‌లో చిన్న జట్లతో ఆడేటప్పుడు రిజర్వ్ బెంచ్‌ను పటిష్టం చేసేందుకు వారికి అవకాశాలివ్వాలి. పురుషుల జట్టు చేస్తోంది అదే. మెగా ఈవెంట్లు, పెద్ద టోర్నీలకు ముందు ఈ కసరత్తు చాలా అవసరం. కానీ మన మహిళల జట్టు విషయంలో అలాంటిదేదీ ఉండదు. రిజర్వ్ ఆటగాళ్లకు అవకాశాలివ్వరు. ఇది జట్టు నిర్మాణానికి ఇబ్బందికరంగా పరిణమిస్తుంది' అని వివరించింది. ఆస్ట్రేలియా కంటే కూడా న్యూజిలాండ్‌తో ఎదురైనా పరాజయమే భారత్ నిష్క్రమణకు కారణమని భావిస్తున్నారా?

ఆశ్చర్యకర విషయం ఏమిటంటే మనం పరిస్థితులకు తగ్గట్లుగా వెంటనే మారకపోవడమే ఆ మ్యాచ్ ఓటమికి కారణం. మందకొడి వికెట్‌పై వన్డే ప్రపంచకప్‌లో అయితే ముందు నింపాదిగా ఆడి తర్వాత పుంజుకొని ఆడే సౌలభ్యం వుంటుంది. కానీ టీ20 ఫార్మాట్‌లో అలాంటి అవకాశం ఉండదు. త్వరితగతిన సందర్భాన్ని బట్టి ఆటతీరు మార్చుకోవాలి. సోఫీ డివైన్ చేసింది అదే. కానీ మనం మాత్రం అలా ఆడలేకపోయాం. జెమీమా, హర్మన్‌ప్రీత్‌లు తరచూ 3, 4 స్థానాలు మార్చుకోవడం కారణమని నేననుకోను.

బ్యాటింగ్‌లో ఓపెనర్ల శుభారంభమే అత్యంత కీలకం. షఫాలీ వర్మ దూకుడుగా ఆడుతుందని అందరికీ తెలుసు కానీ అలా జరగలేదు. ఓపెనర్లిద్దరు బాగా ఆడిఉంటే మిడిల్ ఓవర్లలో యథేచ్ఛగా ఆడే అవకాశముంటుంది. మొదట పవర్ ప్లే, ఆఖర్లో డెత్ ఓవర్లు మంచి స్కోరుకు బాట వేస్తాయి. అయితే దురదృష్టవశాత్తూ ఈ టోర్నీలోని కీలక మ్యాచ్‌ల్లో అలాంటి శుభారంభాలు, చివర్లో దూకుడు కరువయ్యాయి. ఆసియా కప్‌లో కనిపించిన లోపాలపై దృష్టి పెట్టాల్సింది. కానీ అలా ఏమీ జరగలేదు. ప్రపంచకప్ ముంగిట ఫీల్డింగ్ విభాగంపై దృష్టి సారించకపోవడం పెద్ద తప్పిదమని మీరు అంగీకరిస్తారా? విషయంలో ఆస్ట్రేలితో జరిగిన మ్యాచ్ నన్ను తీవ్రంగా నిరుత్సాహపరిచింది. రాధా యాదవ్, జెమీమా రోడ్రిగ్స్ తప్ప 11 మందిలో మిగతా వారంతా మైదానంలో చురుగ్గా కనిపించలేదు. కీలకమైన మ్యాచ్‌లో ఇద్దరితో కట్టడి ఎలా సాధ్యమవుతుంది.ఫిట్‌నెస్ అతిముఖ్యం. దీనిపై మనం ఒక బెంచ్‌మార్క్‌ను పెట్టుకోవాల్సిందే. నిజాయితీగా అడుగుతున్నా ఏడాదంతా ఎంత మంది మన క్రికెటర్లు ఫిట్‌నెస్‌పై శ్రద్ధ పెడుతున్నారో చెప్పగలరా! ఆ శ్రద్ధలేకే మైదానంలో ఫీల్డింగ్ విభాగంపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తుంది. ఒకవేళ సెలక్టర్లు కెప్టెన్‌ను మార్చాలనుకుంటే మాత్రం నేను యువ క్రికెటర్‌కు పగ్గాలివ్వాలని కోరుకుంటాను. సారథ్య మార్పునకు ఇదే సరైన సమయం. ఇంకా ఆలస్యం చేస్తే... మనం ఇంకో ప్రపంచకప్‌కూ దూరమవుతాం. చేస్తే ఇప్పుడే కొత్త సారథిని ఎంపిక చేయాలి. మరీ ప్రపంచకప్ సమీపంలో చేస్తే ఒరిగే ప్రయోజనం కూడా ఉండదు.

స్మృతి కాదు.. కొత్త కెప్టెన్‌గా ఆమెకు ఛాన్స్ ఇస్తేనే.. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన అందుబాటులో ఉన్నప్పటికీ 24 ఏళ్ల జెమీమాకు పగ్గాలిస్తే మంచిదనిపిస్తుంది. ఆమెకు ఎక్కువకాలం సారథిగా కొనసాగే వీలుంటుంది. పైగా మైదానంలో చురుకుదనం, ఫీల్డింగ్‌లో అందరిలో ఉత్తేజం నింపే శక్తి ఆమెకుంది.ఈ టోర్నీ ఆసాంతం ఆమె కనబరిచిన చురుకుదనం నన్ను బాగా ఆకట్టుకుంది. అలాంటి జెమీమాకు పగ్గాలిస్తే జట్టులో కొత్త ఉత్తేజాన్ని నింపినట్లవుతుంది.



## వరంగల్ నేతలపై కాంగ్రెస్ అధిష్టానం సీరియస్

వరంగల్ పంచాయితీని తెంపే బాధ్యతను మంత్రి పొంగులేటికి ఇచ్చిన అధిష్టానం. జిల్లాలో కొండా వర్గీయులు రెచ్చిపోతున్నారని మంత్రి కొండా సురేఖపై వరంగల్ ఎమ్మెల్యేలు అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. దీంతో ఈ గొడవలకు ముగింపు పలికేందుకు అధిష్టానం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి బాధ్యతలు అప్పగించింది. స్థానిక సంస్థల ఎన్నికల ముందు చిన్న చిన్న విషయాలకు ఇలా గొడవలు పడితే పార్టీకి నష్టం జరుగుతుందని, ఎమ్మెల్యేల మధ్య సమన్వయం కుదుర్చాలని మంత్రి పొంగులేటికి అధిష్టానం బాధ్యతలు అప్పగించింది.





## ఎస్‌బీఐ క్రెడిట్‌కార్డు యూజర్లకు గుడ్ న్యూస్

దేశవ్యాప్తంగా ఉన్న 19.5 మిలియన్ల ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు యూజర్లకు సంస్థ శుభవార్త చెప్పింది. పండుగల సీజన్ సందర్భంగా 'ఖుషియోన్ కా ఉత్సవ్' పేరుతో కొనుగోళ్లపై ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. ప్రముఖ ఎలక్ట్రానిక్ బ్రాండ్లు, మొబైల్ ఫోన్స్, ఫ్యాషన్&లైఫ్‌స్టైల్, ఆభరణాలు, ల్యాప్‌టాప్స్, టీవీలు, దుస్తులు, ఫుడ్, డొమెస్టిక్ ఫ్లైట్స్ టికెట్ ధరలు తదితర వాటిపై భారీ డిస్కౌంట్లు, క్యాష్ బ్యాక్, ఈఎంఐ ఆఫర్లు ఉన్నాయి.



## ఇంగ్లండ్‌కు షాక్.. సెమీస్ చేరిన విండీస్

మహిళల టీ20 వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్‌కు విండీస్ షాకిచ్చింది. కీలక మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 7 వికెట్లు కోల్పోయి 141 పరుగులు చేసింది. ఛేదనలో విండీస్ 18 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. దీంతో సెమీస్ బెర్తు ఖాయం చేసుకుంది. అంతకుముందు ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సెమీస్ చేరాయి. ఇంగ్లండ్ ఓటమితో దక్షిణాఫ్రికా కూడా చేరడం గమనార్హం.




## గుండెపోటుతో ఐదేళ్ల చిన్నారి మృతి

ఐదేళ్ల చిన్నారి గుండెపోటుతో మరణించిన ఘటన కరీంనగర్ జమ్మికుంటలో జరిగింది. రాజు-జమున కుమార్తె ఉక్కులు(5) నిన్న ఉదయం కళ్లు తిరుగుతున్నాయని చెప్పింది. చిన్నారిని స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా హన్మకొండకు రిఫర్ చేశారు. అక్కడ వైద్యులు పరీక్షిస్తుండగా ఉక్కులు చనిపోయింది. ఆమెకు పుట్టినప్పటి నుంచే గుండె సంబంధిత సమస్య ఉండొచ్చని, పేరెంట్స్ గుర్తించకపోవడంతో మృతి చెంది ఉంటుందని వైద్యులు తెలిపారు.

## రంగంలోకి దిగనున్న తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్

అధికార కాంగ్రెస్‌పై పవర్ ఫుల్ ఫైట్‌కి సిద్ధమవుతున్నాయి ప్రతిపక్షాలు.. పక్కా ప్లాన్‌తో ప్రజాల్లోకి వెళ్లాలని డిసైడ్ అయ్యాయి. ఎన్నికల హామీలపై కాంగ్రెస్ తీరును ఎండగడుతూ నవంబర్‌లో ఉద్యమానికి కాషాయం పార్టీ సై అంటుంటే.. కాంగ్రెస్ వన్ ఇయర్ పాలనపై పోరాడుతామంటూ డిసెంబర్‌ను ఫిక్స్ చేసుకుంది బీఆర్ఎస్. మరోవైపుత ఎవరెలా వచ్చినా ఏం చేయలేరంటోంది అధికార కాంగ్రెస్. దీంతో తెలంగాణ పాలిటిక్స్ మరింత ఇంట్రెస్టింగ్‌గా మారాయి. రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ నుంచి ప్రజాసమస్యలపై ఉద్యమిస్తామని క్లారిటీ ఇచ్చారు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి. ఒక్క ఇల్లు కట్టలేదు. పేదలకు ఒక్క ఇల్లు పంచలేదు... గ్యారంటీలు రోడ్డున పడ్డాయన్నారు. హామీల పేరుతో రాష్ట్రాన్ని దివాలా తీసేలా చేస్తున్నారంటూ ఫైర్ అయ్యారు. ఎన్నికలప్పుడు ఇచ్చిన ప్రతి హామీపైనా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. ఇక డిసెంబర్‌తో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతుంది. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు ఏం చేసింది...? ఎన్ని గ్యారంటీలు అమలు చేసింది...? ఎన్ని హామీలు నెరవేర్చింది...? అంటూ బీఆర్ఎస్ సైతం ప్రభుత్వంపై ఫైట్‌కి సిద్ధమవుతోంది. డిసెంబర్‌లోనే గులాబీ దళపతి రంగంలోకి దిగుతారన్న ప్రచారం పెద్ద ఎత్తున జరుగుతోంది. రాష్ట్రంలో రాజకీయం రగులుతున్నా బయటకు రాలేదు కేసీఆర్. ఓవైపు రుణమాఫీ పాలిటిక్స్... మరోవైపు హైడ్రా మంటలు.. ఇంకోవైపు మూసీ ప్రక్షాళనపై రాజకీయం ఓ రేంజ్‌లో నడుస్తున్నా...కేసీఆర్ బయటకు రావడం లేదు. ప్రభుత్వం వైఫల్యాలపై ఎలా ముందుకెళ్లాలో కూడా కేడర్‌కు దిశానిర్దేశం చేయలేదు. అంతేకాదు ఆ మధ్య తెలంగాణలో భారీ వరదలు ముంచేత్తిన సమయంలోనూ కేసీఆర్ జనం మధ్యకు రాలేదు. కౌశిక్‌రెడ్డి ఇష్యూ జరిగినా కేసీఆర్ మౌనం వీడలేదు. ఈవన్నీ అంశాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావే మాట్లాడుతున్నారు. మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు జనంలోనే ఉంటున్నారు. కేసీఆర్ మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. ప్రెస్‌నోట్లు కూడా ఇవ్వలేదు. దీంతో కేసీఆర్ ఎందుకు ప్రజల్లోకి రావట్లేదని రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అయితే ఇదే అంశాన్ని క్యాష్ చేసుకుంటోంది అధికార కాంగ్రెస్ పార్టీ. కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితం కావడంపై మంత్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో అధికార పార్టీ విమర్శలకు అదే స్థాయిలో కౌంటర్ ఇస్తూ వస్తోంది బీఆర్ఎస్. కేసీఆర్‌కి ఎప్పుడు ప్రజల్లోకి రావాలో తెలుసంటున్నారు గులాబీ లీడర్లు. ఇక ఇన్ని ఇష్యూస్ ఉన్నా కేసీఆర్ రియాక్ట్ కాకపోవడానికి చాలా కారణాలు ఉన్నాయంటున్నారు



## వర్షం ఎఫెక్ట్.. ఆలస్యంగా భారత్ vs న్యూజిలాండ్ మ్యాచ్

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఉదయం 9.30 గంటలకు భారత్ , న్యూజిలాండ్ మధ్య జరగాల్సిన టెస్ట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. ఉదయం 9 గంటలకు జరగాల్సిన టాస్ వాయిదా పడింది. వర్షం తగ్గిన తర్వాతే టాస్ నిర్వహిస్తారు. కానీ, బుధవారం బెంగళూరులో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య తొలి టెస్టు తొలిరోజు ఆట జరగడం అనుమానమేనని అంటున్నారు.రెండో రోజు కూడా 80 శాతం వర్షాలు కురుస్తాయని వెదర్.కామ్ నివేదిక వెల్లడించింది. అందుకే తొలి రెండు రోజులు ఆట జరగడం అనుమానమే. మూడు, నాల్గవ రోజు వర్షం కురిసే అవకాశం 60% ఉంది. అయితే, ఆ రెండు రోజులు కూడా పూర్తి ఆటను ఆశించలేం. అలాగే, ఐదో రోజు కూడా 70 శాతం వర్షం కురుస్తుందని వెదర్ డాట్ కామ్ నివేదిక పేర్కొంది. అందువల్ల భారత్, న్యూజిలాండ్ మధ్య తొలి టెస్టు మ్యాచ్ జరిగే అవకాశం లేదు. అయితే, మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించడం దాదాపు ఖాయమైంది.

### రెండో టెస్టు మ్యాచ్ ఎప్పుడు?



అక్టోబర్ 24 నుంచి భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టు మ్యాచ్ ప్రారంభం కానుంది. పుణెలోని మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో అక్టోబర్ 28 వరకు మ్యాచ్ జరగనుంది. మూడో మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జరగనుండగా, ఈ మ్యాచ్ నవంబర్ 1 నుంచి నవంబర్ 5 వరకు జరగనుంది.

రెండు జట్లు..

భారత టెస్టు జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), యస్సవి జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కేఎల్ రాహుల్, సర్ఫరాజ్ ఖాన్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ , జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్.


న్యూజిలాండ్ టెస్ట్ జట్టు: టామ్ లాథమ్ (కెప్టెన్), టామ్ బ్లండెల్ (వికెట్ కీపర్), మార్క్ చాప్మన్, డెవాన్ కాన్వే, మాట్ హెన్రీ, డారిల్ మిచెల్, విల్ ఓరూర్క్, అజాజ్ పటేల్, గ్లెన్ ఫిలిప్స్, రచిన్ రవీంద్ర, మిచెల్ సాంట్నర్, టిమ్ సౌతీ, కేన్ విలియమ్సన్ (మొదటి మ్యాచ్‌కు అందుబాటులో లేరు), జాకబ్ డఫీ, విల్ యంగ్, మైకేల్ బ్రేస్‌వెల్ (మొదటి టెస్టు మాత్రమే), ఇష్ సోధి (మొదటి మ్యాచ్‌కు అందుబాటులో లేరు).

## మరోసారి మాస్ కాంబో.. ఈసారి అఖండ తాండవమే..

బోయపాటి-బాలకృష్ణ సినిమా వస్తుందంటే మాస్ ప్రేక్షకులకు పండగే. వీళ్లిద్దరి కాంబోలో వచ్చిన 'సింహ', 'లెజెండ్', 'అఖండ'.. మూడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. 2021లో ప్రేక్షకుల ముందుకొచ్చిన 'అఖండ' బాలయ్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ల జాబితాలో చేరింది. దీంతో వీళ్లిద్దరి తర్వాత ప్రాజెక్ట్‌పై సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పుడు మరోసారి ఈ కాంబో రిపీట్ కానుంది. 'అఖండ 2 - తాండవం' పేరుతో సీక్వెల్ తెరకెక్కనుంది. టైటిల్ పోస్టర్‌ను నిర్మాణసంస్థ తాజాగా విడుదల చేసింది. పోస్టర్‌లో ఆధ్యాత్మికతను జోడిస్తూ.. శివలింగం, రుద్రాక్షలు, హిమాలయాలు వంటి పలు అంశాలను చూపారు. బాలకృష్ణను మాస్ అవతారంలో చూపించడంలో బోయపాటి ముందుంటారు. దీంతో ఈ చిత్రంలో బాలయ్యను ఎలా చూపిస్తారా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కనుంది. బాలకృష్ణ - బోయపాటి ఇద్దరి కెరీర్‌లోనే ఇది అత్యంత భారీ బడ్జెట్ సినిమాగా రానుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించనున్నారు. దీని రెగ్యులర్ షూటింగ్ త్వరలోనే ప్రారంభం కానుంది. 14 రీల్స్ పతాకంపై ఈ చిత్రాన్ని రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. బాలయ్య కుమార్తె తేజస్విని సమర్పకురాలిగా వ్యవహరించనున్నారు. అటు దర్శకుడు బోయపాటితో పాటు.. బాలకృష్ణకు కూడా ఇదే మొదటి పాన్ ఇండియా చిత్రం కానుండడం విశేషం.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM




## భారీ వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

భారీ వర్షాలపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఆకస్మిక వరదల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నెల్లూరు, ప్రకాశం, తిరుపతి, చిత్తూరు సహా పలు జిల్లాల్లో వర్షాలపై అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. వర్ష ప్రభావిత జిల్లాల్లోని పరిస్థితులను నివేదించాలని సూచించారు. విజయనగరం జిల్లా గుర్లలో అతిసారంతో ఐదుగురి మృతిపై సీఎం విచారం వ్యక్తం చేశారు. మంగళవారం ఒక్కరోజే నలుగురు మృతి చెందారన్న సమాచారంపై ఆరా తీశారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో బాధితుల పరిస్థితి, చికిత్స వివరాలు తెలుసుకున్నారు. అన్నమయ్య జిల్లాలో ఆలయ ధ్వంసం ఘటనను ఖండించారు. కదిరినాథునికోట అభయాంజనేయస్వామి ఆలయంపై దాడిపై విచారణకు ఆదేశించారు. సమగ్ర విచారణ జరిపి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.



## చెన్నై, బెంగళూరులో భారీ వర్షం



దక్షిణ భారతదేశంలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా చెన్నై, బెంగళూరులో పాఠశాలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. కేరళ రాష్ట్రంలో సైతం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. భారీ వర్షాల హెచ్చరికల దృష్ట్యా చెన్నై, కాంచీపురం, తిరువళ్లూరు, చెంగల్‌పేట జిల్లాల్లో పాఠశాలలు, కళాశాలలను మూసివేయాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన సేవలు మినహా ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు కూడా మూసివేయలని పేర్కొంది.రేపు (గురువారం) తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాల వెంబడి, నైరుతి, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో గంటకు 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. నైరుతి, ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన పీడన ప్రాంతం పశ్చిమం నుంచి వాయువ్య దిశగా కదులుతూ మంగళవారం సాయంత్రం అల్పపీడనంగా మారింది. మరోవైపు భారీ వర్ష సూచన నేపథ్యంలో బెంగళూరు, చెన్నైలలో బుధవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ సిబ్బందిని నగరంలో మోహరించారు."బెంగళూరులో భారీ వర్షాల నేపథ్యంలో బెంళూరులో హై అలర్ట్ ప్రకటించాం. ఇప్పటికే బెంగళూరులో సుమారు 60 మంది ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది మోహరించాం. ఏదైనా అవసరం కోసం సిద్ధంగా ఉండటానికి మరో 40 మందిని మళ్లీ నియమించాం. అగ్నిమాపక , అత్యవసర సేవలను సిబ్బందిని అందుబాటులో ఉంచాం' అని కర్ణాటక రెవెన్యూ మంత్రి కృష్ణ బైరే గౌడ తెలిపారు.



## సీఎం రేవంత్ రెడ్డిని నిలదీసిన కేటీఆర్

రేవంత్ కుర్చీ ఎక్కిన రోజు నుండి మొత్తం 80,500 కోట్లు అప్పు తీసుకొచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పది నెలల్లో 80,500 కోట్ల రికార్డు అప్పులు చేశారని అన్నారు. అప్పు-తప్పు అన్నోళ్లని.. ఇప్పుడు దేనితో కొట్టాలని ప్రశ్నించారు. ఎన్నికల హామీలేవీ తీర్చలేదు..! ఏ కొత్త సాగునీటి ప్రాజెక్టు కట్టలేదు..!! మరి ముఖ్యమంత్రి తెస్తున్న అప్పు ఏమైనట్టు ? 80 వేల కోట్ల ధనం ఎవరి జేబులోకి వెళ్లినట్టు ?? అని నిలదీశారు. బడా కాంట్రాక్టర్ల బిల్లులకే ధారాదత్తం చేస్తున్నారా ? కమిషన్ల కోసం కక్కుర్తి పడే అప్పులు తెస్తున్నారా ?? అని ప్రశ్నించారు.ఆర్బీఐ నుంచి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.1000 కోట్ల అప్పు తీసుకున్నది. స్వయంగా ఆర్బీఐ మంగళవారం ఈ విషయాన్ని ప్రకటించింది. దీంతో నిరుడు డిసెంబర్ 7న అధికార పగ్గాలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటివరకు 315 రోజుల్లో రేవంత్‌రెడ్డి సర్కారు తెచ్చిన అప్పులు రూ.74,495 కోట్లకు పెరిగాయి. గత నెలలో 3 దఫాలుగా రూ.4,500 కోట్ల రుణాలు పొందిన రేవంత్ ప్రభుత్వం.. ఈ నెల 1న రూ.2,000 కోట్ల అప్పు తీసుకున్నది.



## శాన్వి శ్రీవాస్తవ గ్లామర్ షో

శాన్వి శ్రీవాత్సవ.. ఈ పేరుకు కొత్తగా పరిచయం అవసరం లేదు. లవ్లీ సినిమాతో తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. ఆ సినిమా బాగానే ఆడినా కూడా తెలుగులో గుర్తింపు మాత్రం తెచ్చుకోలేకపోయింది. అయితే పక్కనున్న కన్నడలో మాత్రం సంచలనాలు సృష్టిస్తుంది ఈ భామ. అక్కడ స్టార్ హీరోలతో నటిస్తూ రఫ్ఫాడిస్తుంది. సినిమా ఇండస్ట్రీలో చాలా కాలం పాటు అగ్ర హీరోయిన్ గా కొనసాగాలి అంటే అంత సాధారణమైన విషయం కాదు. పోటీలో చాలామంది బ్యూటీలు వస్తూ ఉంటారు వెళుతూ ఉంటారు. ఆ తర్వాత నుంచి ఆమె తెలుగు సినీ పరిశ్రమలో కనిపించట్లేదు. కేవలం కన్నడ సినిమాలు మాత్రమే చేస్తోంది. అయినప్పటికీ సోషల్ మీడియాల ద్వారా తెలుగు అభిమానులకు చాలా దగ్గరగా ఉంటోంది.

## నష్టాలతో స్టాక్ మార్కెట్

దేశీయ మార్కెట్ సూచీలు బుధవారం నష్టాల్లో మొదలయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాలు మన సూచీలపై ప్రభావం చూపాయి. దీంతో నేటి ట్రేడింగ్‌ను సూచీలు స్వల్ప నష్టాలతో ప్రారంభించాయి. ఉదయం 9:30 గంటల సమయంలో సెన్సెక్స్ 150 పాయింట్లు నష్టపోయి 81,677 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 38 పాయింట్లు కుంగి 25,019 వద్ద కొనసాగుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.06 వద్ద కొనసాగుతోంది. సెన్సెక్స్ 30 సూచీలో నెస్లే ఇండియా, ఎంఅండ్ఎం, అల్ట్రాటెక్ సిమెంట్, టీసీఎస్, కోటక్‌మహీంద్రా బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, పవర్‌గ్రిడ్, ఎన్టీపీసీ, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 74.40 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్సు 2,682 డాలర్ల వద్ద కొనసాగుతోంది.







## ఆన్‌లైన్ నమోదు లేకున్నా అయ్యప్ప దర్శనం

శబరిమల అయ్యప్ప దర్శనానికి ఆన్‌లైన్‌లో మాత్రమే నమోదు చేసుకోవాలన్న తమ నిర్ణయాన్ని కేరళ ప్రభుత్వం వెనక్కు తీసుకుంది. సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతుండటంతో తన నిర్ణయాన్ని మార్చుకుంది. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకపోయినా భక్తులకు అయ్యప్ప దర్శనం కల్పిస్తామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ మంగళవారం అసెంబ్లీలో స్పష్టం చేశారు. వర్చువల్ నమోదు గురించి తెలియకుండా వచ్చిన వారికీ దర్శనం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదానికి గురైనప్పుడు లేదా తప్పిపోయినప్పుడు భక్తులను గుర్తించేందుకు ఆన్‌లైన్ నమోదు ఉపయోగపడుతుందని అన్నారు. ఈ విధానం తిరుపతిలోనూ అమలులో ఉందని గుర్తుచేశారు.

## విడిపోని బంధానికి 22 ఏళ్లు.. అవిభక్త కవలలు వీణవాణీ

అవిభక్త కవలలు వీణ-వాణీ 22వ వసంతంలోకి అడుగుపెట్టనున్నారు. బుధవారం 22వ జన్మదినం జరుపుకోనున్నారు. ఇద్దరు అవిభక్త కవలలను విడదీయాలని ప్రభుత్వాలను, వైద్యులను వేడుకుంటున్నా ఫలితం లేదని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుట్టినప్పటి నుంచి 13 ఏళ్ల దాకా హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రి వారికి అండగా నిలిచింది. కొంత కాలం క్రితం వీరిని హైదరాబాద్‌లోని శిశు విహార్ (స్టేట్‌హోం)కు తరలించారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం బీరిశెట్టిగూడెం గ్రామానికి చెందిన మారగాని మురళీ-నాగలక్ష్మి దంపతులకు నలుగురు కూతుర్లు, పెద్ద కుమార్తె బింధు, రెండో సంతానంగా వీణవాణీ అవిభక్త కవలలుగా జన్మించారు. సింధు నాలుగో సంతానం. 2003 అక్టోబర్ 16న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇద్దరు జన్మించారు. పుట్టుకతో వీరు తలలు కలిసి జన్మించారు. నిరుపేద కుటుంబం కావడంతో రెండేళ్ల పాటు గుంటూరుకు చెందిన వైద్యుడు నాయుడమ్మ దగ్గర చికిత్స అందించారు.





## తెలంగాణలో ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత ఐవీఎఫ్ సేవలు

సంతానం లేని వారికి గుడ్ న్యూస్ ప్రభుత్వాస్పత్రుల్లో ఉచిత ఐవీఎఫ్ సేవలు అందించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు అవసరమైన మెడిసిన్, పరికరాలను కొనుగోలు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించినట్లు సమాచారం. సమస్య తీవ్రత ఎక్కువగా ఉండటంతో రాష్ట్రవ్యాప్తంగా ఈ సేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో మాత్రమే ఐవీఎఫ్ సేవలు ఉండగా, ఇకపై జిల్లాల్లోనూ అందుబాటులోకి రానున్నాయి.

## ఆమ్రపాలి.. ఆంధ్రాకే! క్యాట్‌లో దక్కని ఊరట

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర విభజన సందర్భంగా ఎవరికి కేటాయించిన రాష్ట్రాలకు వారు వెళ్లాల్సిందేనని ఇటీవల డీవోపీటీ ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని కోరుతూ మరికొందరు ఐఏఎస్ అధికారులతోపాటు ఆమ్రపాలి కూడా క్యాట్‌ను ఆశ్రయించగా, బుధవారంలోగా ఏపీలో రిపోర్టు చేయాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో ఆమె ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. క్యాట్ ఈ నిర్ణయంతో ఏపీకి వెళ్లాల్సిన వారు బుధవారం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది. డీవోపీటీ ఆదేశాల కనుగుణంగా యథావిధిగా ఏపీలో రిపోర్టు చేయాలని క్యాట్ ఆదేశించడంతో, హైకోర్టు ఎలాంటి ఆదేశాలిస్తుందో తెలియనందున ముందైతే ఏపీకి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల వరకు వేచి చూడనున్నారు. ఏపీకి వెళ్లినా, రెండు రాష్ట్రాల పరస్పర అవసరాలు, ఒప్పందాలతో తిరిగి తెలంగాణకు రప్పించే అవకాశాలూ ఉంటాయనే ప్రచారం మొదలైంది.






## ఏపీలో త్వరలో వైన్ షాపుల్లో పర్మిట్ రూమ్‌లు?

మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు కూడా ప్రభుత్వం అనుమతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇందుకు రూ.5 లక్షలు ఫీజుగా వసూలు చేస్తుందని సమాచారం. త్వరలోనే దీనిపై సర్కార్ ఓ నిర్ణయం తీసుకుంటుందని వార్తలు వస్తున్నాయి. కాగా నేటి నుంచి రాష్ట్రంలోని 3,396 ప్రైవేట్ మద్యం దుకాణాలు తెరుచుకుంటాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయిస్తారు. అన్ని ప్రముఖ బ్రాండ్లు అందుబాటులో ఉంటాయి.